


నేటి నుంచి శరన్నవరాత్రులు



వీరఘట్టం: వీరఘట్టం ఇలవేల్పు శ్రీకోటదుర్గతల్లి శరన్నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. యజ్ఞకర్త ఎస్.వి.ఎల్.ఎన్ శర్మయాజీ ఆధ్వర్యంలో ఈ నెల 22 నుంచి వచ్చే నెల 2 వరకు దసరా మహోత్సవాలు జరగనున్నాయి. తొలి రోజు సోమవారం ఉదయం 4 గంటలకు తొలి పూజ చేయనున్నారు. అనంతరం ఉదయం 6 గంటల నుంచి 11 గంటల వరకు నిర్విరామంగా మహిళలచే దుర్గాదేవికి కుంకుమ పూజలు ఉంటాయన్నారు. దుర్గాదేవిని దర్శించుకునేందుకు వచ్చే భక్తుల కోసం ప్రత్యేకంగా క్యూలైన్ ఏర్పాటు చేశారు.













కరుణించు కోటదుర్గమ్మ

- ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం
- భక్తుల పాలిటి కొంగు బంగారం
- నేడు అమ్మవారి నిజరూప దర్శనం

పాలకొండ రూరల్:

భక్తుల కోర్కెలు తీర్చే కొంగు బంగారం.. ఉత్తరాంధ్రుల ఆర్యాధ్యదైవంగా వేనోళ్ల కీర్తింపబడుతున్న పాలకొండ కోటదుర్గమ్మ దర్శనం పూర్వజన్మ సుకృతం. సుదీర్ఘకాలం మునుపు జాతాపు అనే గిరిజన తెగకు చెందిన రాజులు ఈ ప్రాంతాన్ని పాలించేవారు. వీరు విలాసాలకు, వ్యసనాలకు బానిసలై, అధికారం కోసం వివాదాల బారిన పడ్డారు. ఈ నేపథ్యంలో స్థానిక జమీను విడిచి వెళ్లిపోయారు. వారి పాలనకు గుర్తుగా రెండు చెరువుల మధ్య ఓ కోట ఉండేది. కోటలో వెలసిన దుర్గాదేవిని వారు ఇలవేల్పుగా కొలిచేవారు. రాజుల అనంతరం ఈ ప్రాంతం అడవిని తలపించేది. కోట శిథిలావస్థకు చేరింది. ఇలా కొన్నేళ్లు గడిచిన అనంతరం అమ్మవారు ఒడిశాకు చెందిన కృష్ణవల్లభ దాస్‌కు కలలో దర్శనమిచ్చారు. తాను పాలకొండలో శిథిలమైన కోటలో కొలువున్నట్టు తెలిపారు. తనను వెలికితీసి భక్తులకు దర్శించుకునేలా చూడాలని సూచించారు. 1946వ దశకంలో కృష్ణవల్లభదాస్ శిథిల కోటకు చేరుకున్నారు. శిలా రూపంలో ఉన్న అమ్మవారిని గుర్తించి పూజలు చేపట్టారు. ఒడిశాకు చెందిన శిల్పులచే అమ్మవారి రూపం చేయించారు. నాటి నుంచి కోటలో ఉన్న అమ్మవారు కోటదుర్గమ్మగా వాసికెక్కారని ప్రతీతి. 2001లో దేవదాయశాఖ పరిధిలోకి అటుపై దేవస్థానంగా మార్పు చెందింది.

నేడే నిజరూప దర్శనం

ఏడాదిలో కొద్ది గంటల సమయం మాత్రమే అమ్మవారి నిజరూప దర్శనం లభిస్తుంది. విజయదశమి వేడుకల్లో ముహూర్తపు రాట వేసే సోమవారం తొలి రోజున ఈ దర్శనం భక్తులకు కలిస్తారు. అత్యంత అపురూపమైన, శక్తివంతమైన ఈ దర్శనంతో ఏడాది పొడువునా అమ్మను దర్శించే పుణ్యంతో పాటు మంచి జరుగుతుందని భక్తుల నమ్మకం. ఉమ్మడి ఆంధ్రా, ఒడిశా రాష్ట్రాలకు చెందిన భక్తులు ఈ దర్శనం కోరి వస్తారని అధికారులు అంచనా వేస్తున్నారు. భక్తుల సౌలభ్యం కోసం తూర్పు ప్రధాన గోపుర మార్గం నుంచి దేవస్థానంకు చేరుకునేలా చర్యలు చేపట్టారు. సర్వ దర్శనంతో పాటు ప్రత్యేక, శీఘ్ర దర్శనాలు, వృద్ధులు, దివ్యాంగుల కోసం ప్రత్యేక మార్గాలపై దృష్టి పెట్టారు. ప్రముఖుల కోసం దక్షిణ ప్రధాన గోపుర మార్గం కేటాయించారు. అమ్మవారికి సమర్పించే ఘటాల ప్రత్యేక మార్గంలో ముందుకు వెళ్లనున్నాయి. శరన్నవరాత్రుల్లో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని శాఖలు సమన్వయంతో ముందుకు సాగుతున్నారు.


శరన్నవరాత్రి ఉత్సవాలకు సిద్ధమైన కోటదుర్గమ్మ దేవస్థానం


1970వ దశకంలో కోటదుర్గమ్మ

నేటి నుంచి దసరా ఉత్సవాలు

గరుగుబిల్లి: మండలంలోని గరుగుబిల్లి, పెద్దూరు, రావుపల్లి, రావివలస తదితర గ్రామాలలోని అమ్మవారి ఆలయాలలో సోమవారం నుంచి శరన్నవరాత్రి మహోత్సవాలను నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లును కమిటీ సభ్యులు చేశారు. దసరా ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు వీలుగా ఆలయాలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్ది విద్యుత్ అలంకరణలతో ముస్తాబు చేశారు. శరన్నవరాత్రి మహోత్సవాలలో భాగంగా తొమ్మిది రోజులు అమ్మవారిని తొమ్మిది రూపాలలో అలంకరించడంతో పాటు పలు పూజలను, అర్చనలను, సామూహిక కుంకుమ పూజలను నిర్వహించనున్నారు.


పెద్దూరులోని దుర్గాదేవి ఆలయంలో కొలువైన అమ్మవారు

సరిహద్దులో వెలిసిన కోటదుర్గమ్మ

భామిని: ఆంధ్రా - ఒడిశా సరిహద్దు వంశధార నదీ తీరంలో వెలసిన శ్రీ కోటదుర్గమ్మ సన్నిధి దర్శనమంటే భక్తులకు వరంలాంటిది. బత్తిలి శివారులో పాత పోలీసు క్వార్టర్స్ ప్రాంతంలో ఉన్న అమ్మ సన్నిధిలో దసరా ఉత్సవాల్లో భాగంగా దేవి విగ్రహాన్ని ప్రతిష్ఠించి నవరాత్రులు పూజలు నిర్వహించడం ఆనవాయితీ. దుర్గామాత విగ్రహ ఏర్పాటుకు ప్రత్యేక అలంకరణతో మందిర ఏర్పాటు కూడా చేయనున్నారు. బత్తిలిలో వెలిసిన శ్రీత్రిపుర సుందరీ దేవి ఆలయంలోనూ దేవి నవరాత్రుల ఉత్సవాలు నిర్వహించనున్నారు.


బత్తిలి శివారులో వెలసిన శ్రీ కోటదుర్గమ్మ

రెవెన్యూ అసోసియేషన్ అధ్యక్షురాలిగా సావిత్రి

పాలకొండ: పాలకొండ డివిజన్ రెవెన్యూ అసోషియేషన్ అధ్యక్షురాలుగా సబ్ కలెక్టర్ కార్యాలయం ఏవో ఎం.సావిత్రి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సబ్ కలెక్టర్ కార్యాలయం ఆవరణలో రెవెన్యూ అసోషియేషన్ ఎన్నికలు ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా డివిజన్ పరిధిలోని రెవెన్యూ ఉద్యోగులు అసోషియేషన్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యదర్శిగా పాలకొండ తహసీల్దార్ కార్యాలయం సీఎస్‌డీటీ పి.సన్యాసిరావు, అసోసియేట్ అధ్యక్షులుగా హెచ్‌డీటీ ఎంఎస్ ప్రసాద్‌రావును ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా టి.సురేష్‌కుమార్, ఎన్.శేఖరం, కె.శ్రీవిద్యలను ఎన్నుకున్నారు. జాయింట్ సెక్రటరీలుగా ఆర్.మనోహర్, పి.మణిప్రభ, మీనాక్షి, కోశాధికారిగా వి.గణేష్, కార్యవర్గ సభ్యులుగా ఎస్.ఆశాలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టరేట్ ఏవో జి.శ్రీరామ్‌మూర్తి, డీటీ ప్రసాద్‌రావు ఎన్నికల అధికారులుగా వ్యవహరించారు. బలిజిపేట తహసీల్దార్ బాలమురళీకృష్ణ ఎన్నికల పరిశీలకులుగా వ్యవహరించారు. ఎన్‌జీవో సంఘం డివిజన్ గౌరవ అధ్యక్షులు ఎ.లిల్లీపుష్పనాథం ఈ ఎన్నికలను పర్యవేక్షించారు.


నూతనంగా ఎన్నికైన రెవెన్యూ అసోషియేషన్ సభ్యులు

నేటి నుంచి దేవి నవరాత్రి ఉత్సవాలు

గుమ్మలక్ష్మీపురం: మండల కేంద్రంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో రాబోవు విజయదశమిని పురస్కరించుకొని సోమవారం నుంచి దేవి నవరాత్రి ఉత్సవాలను స్థానిక వర్తక, వైశ్య సంఘాలు, మోటారు యూనియన్ల ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్టు సర్పంచ్ బి.గౌరీశంకరరావు, ఉత్సవ కమిటీ సభ్యులు ఆదివారం వెల్లడించారు. దుర్గాదేవి విగ్రహాన్ని గ్రామంలో ఊరేగించిన పిదప, మండపం వద్ద ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహించనున్నట్టు తెలిపారు. భక్తులంతా పాల్గొని దేవి ఆశీస్సులు పొందాలని కోరారు.

ఘనంగా గురజాడ జయంతి

సీతంపేట: సీతంపేట శాఖా గ్రంథాలయంలో ఆదివారం నిర్వహించిన గురజాడ జయంతి వేడుకల్లో శ్రీకాకుళం జిల్లా గ్రంథాలయ సంస్థ సెక్రటరీ వి.వి.జి.శంకర్ చేతుల ఆధ్వర్యంలో నిర్వహించారు. గురజాడ చిత్రపటానికి పూల మాలలు వేసి ఆయన చేసిన సేవలు కొనియాడారు. గ్రంథాలయ అధికారి బబ్బూరి గణేష్‌బాబు, సహాయకుడు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు ఇబ్బందులు కలిగించొద్దు..: డీఎస్పీ

పాలకొండ: కోటదుర్గమ్మ ఉత్సవాల్లో భక్తులతో మర్యాద పూర్వకంగా వ్యవహరించాలని, వారికి ఎటువంటి ఇబ్బందులు కలగకుండా విధులు నిర్వహించాలని డీఎస్పీ ఎం.రాంబాబు సూచించారు. దసరా ఉత్సవాల నిర్వహణ కోసం సిబ్బందికి విధులు, బాధ్యతలు ఆదివారం అప్పగించారు. ఈ సందర్భంగా ఆయన ఈ తొమ్మిది రోజుల పాటు పోలీసులు నిర్వహించాల్సిన విధులు వివరించారు. పార్కింగ్, క్యూలైన్లు, ప్రధాన ద్వారం, అవుట్ గేట్ ప్రధాన రహదారిలో పోలీసులకు విధులు అప్పగించారు. నిరంతరం పోలీసు కంట్రోల్ రూం పని చేయాలని సూచించారు. స్థానిక సీఐ ప్రసాద్, ఎస్ఐ ప్రయోగమూర్తి ఈ బందోబస్తును పర్యవేక్షణ చేస్తారని తెలిపారు. మొత్తం 200 మంది సిబ్బంది, ఒక డీఎస్పీ, ఇద్దరు సీఐలు, ఐదుగురు ఎస్ఐలు బందోబస్తు కోసం కేటాయించామని తెలిపారు.























